క్లుప్తంగా

వైభవంగా ఆరుద్రాభిషేకం



తిరువీధుల్లో విహరిస్తున్న నటరాజ స్వామి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీపల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని ప్రత్యేకంగా నటరాజ స్వామికి ఆరుద్రాభిషేకం నిర్వహించారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీశివగామి సుందరి సమేత శ్రీ నటరాజ స్వామిని పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే కైలాసనాథ కోనలో కామాక్షాంబిక సమేత కైలాసనాథుడికి, పాలమంగళం పాలీశ్వరస్వామికి, తుంబూరులో తుంబీశ్వరస్వామికి వేకువ జామునే ఆరుద్రఅభిషేకాలను నిర్వహించారు.

పట్టు వస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

నారాయణవనం: భోగి పండుగ సందర్భంగా పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి స్థానిక వీరరాఘవస్వామి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం మాట్లాడుతూ ఏటా భోగి పండుగ రోజున కల్యాణ వెంకన్నకు పట్టువస్త్రాలను సమర్పించడం సంప్రదాయంగా కొనసాగుతోందన్నారు.

ఇద్దరు యువకులకు గాయాలు

సత్యవేడు: మండలంలో కాళమనాయుడుపేట వ్యవసాయ చెక్‌పోస్టు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు గాయపడిన యువకులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్కూటర్ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు పిచ్చాటూరుకు చెందిన వారిగా గుర్తించారు.

యువకుడి మృతి



జగదీష్(ఫైల్)

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిపై ఓ లారీ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో జగదీష్(27) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తుంబూరు దళితవాడకు చెందిన జగదీష్ బైక్‌పై సోమవారం సాయంత్రం కృష్ణమరాజుల కండ్రిగ క్రాస్ రోడ్డు వద్ద వెళ్తుండగా చెన్నై వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అతను కిందపడిపోగా లారీ అతనిపై వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం పుత్తూర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి లారీ డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్



ఆలయం వద్ద ఐఏఎస్ అధికారి చక్రవర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ కేబీఆర్‌హెచ్ఎస్ చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు వేద ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గొబ్బి దేవతలకు పూజలు



శ్రీకాళహస్తి: పట్టణంలోని వెలంపాళెం వీధిలో సంక్రాంతి సందర్భంగా గౌరమ్మ(గొబ్బెమ్మ)లకు పూజలు చేశారు. ఈ వీధిలో మూడు చోట్ల గౌరమ్మ(గొబ్బెమ్మ)లను ప్రతిష్ఠించగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

శాస్త్రోక్తంగా అరికట్లోత్సవం



కుండలు ఎగరవేస్తున్న వేద పండితులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం అరికట్లోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో కుండలను పూలతో అలంకరించారు. వేద పండితులు ప్రత్యేక వేషధారణతో ఆ కుండలు ఎగుర వేసుకుంటూ నృత్యం చేస్తూ వెళ్లి చుక్కాని నిర్వహించే ప్రాంతంలో హోమంలో వేసి వెలిగించారు.

అధ్వానంగా తడ-శ్రీకాళహస్తి రోడ్డు



సత్యవేడు-కదూరు కూడలి రోడ్డు మార్గంలోని యానాదివెట్టు వద్ద బావులను తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు



సీఎం సారూ..
ఇటు చూడరూ..!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడ చూసినా గుంతలు, గచ్చులతో పాడైపోయిన రోడ్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు నానా తిప్పలు పడుతున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడుతో పాటు పవన్ కల్యాణ్ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లలో గుంతలు పూడ్చడంతో పాటు కొత్తరోడ్లు వేస్తామని హామీ ఇచ్చేశారు. ఇటీవల కూడా సీఎం చంద్రబాబు సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఆ హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లు కావొస్తున్నా.. రాష్ట్రంలో ఏ ఒక్కచోటా రోడ్లను బాగు చేసిన దాఖలాలు లేవు. ఉదాహరణ తిరుపతి జిల్లా పరిధిలోని ఏర్పేడు మండలంలోని పలు గ్రామీణ రోడ్ల దుస్థితిని తెలియజేస్తున్న చిత్రాలే వీటికి సాక్షాలు

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

- శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో దుస్థితిలో రోడ్లు
- అడుగుకో గుంత.. ప్రజలకు తప్పని చింత
- సంక్రాంతికి రోడ్లను బాగు చేస్తామన్న సీఎం చంద్రబాబు హామీ
- నేటికీ రోడ్లకు మోక్షం లేదు



తడ- శ్రీకాళహస్తి రోడ్డు మార్గంలోని బత్తవల్లం వద్ద ఛిద్రమైన రోడ్డు

వరదయ్యపాళెం: సంక్రాంతి పండుగ నాటికి గుంతలు లేని రోడ్లను ఏర్పాటు చేస్తామని.. ఎక్కడైనా గుంతలు పడినట్లు సంక్రాంతి పండుగకు వచ్చే అతిథుల నుంచి ఫిర్యాదులు అందితే ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అంతుచూస్తాను అని స్వయానా సీఎం చంద్రబాబు నాయుడు పలు సమావేశాల్లో ఊకదంపుడు ప్రసంగాలు ఇచ్చారు. కానీ పండుగ వచ్చినా ఆ మాటలన్నీ గాలికి కొట్టుకుపోయాయి. ఆ దిశగా సత్యవేడు నియోజకవర్గంలోని పలు ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. శ్రీకాళహస్తి-తడ, సత్యవేడు-కదూరు కూడలి, ఊత్తుకోట-సత్యవేడు, చిన్న పాండూరు-నాగలాపురం, ఆరూరు-కారిపాకం, వరదయ్యపాళెం- సంతవేలూరు, బీఎన్‌కండ్రిగ-సూళ్లూరుపేట మార్గాల నుంచి రోజువారీ శ్రీసిటీ పరిశ్రమలకు అనేక మంది ఉద్యోగులు, కార్మికులు వివిధ రకాల బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల్లో వెళ్తుంటారు. అయితే ఇంతటి ప్రాముఖ్యత కలిగిన రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదు.



టీసీఎల్ కంపెనీ మీదుగా పల్లెలకు వెళ్లే ప్రధాన మార్గం ఇలా..



చిన్నపాండూరు-నాగలాపురం ప్రధాన రోడ్డు మార్గంలో ఏర్పడిన భారీ గుంతలు



విశ్వతమాల వయా మర్రిమంద గ్రామం ప్రధాన రోడ్డు ఇలా..

భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దగ్ధం



భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు వేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): జిల్లావ్యాప్తంగా పట్టణాలు, పల్లెల్లో విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో దగ్ధం చేసి విద్యుత్ చార్జీలు పెంపుపై వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. శ్రీకాళహస్తి మండలం అమ్మచెరువు గ్రామంలో సోమవారం విద్యుత్ బిల్లులను గ్రామస్తులతో కలిసి భోగిమంటల్లో దగ్ధం చేశారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఆరు నెలలు గడవక ముందే రెండు దఫాలు చార్జీలు రూ.15 వేల కోట్లపైన పెంచి ప్రజల పైన భారం మోపిందన్నారు. ఈ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కార్పొరేట్లకు సంపదను సులభంగా ధారాదత్తం చేయడానికి రాష్ట్రప్రభుత్వం కంకణం కట్టుకుందా ? అని ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్ బిగించి ప్రజలను, రైతులను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారికి సత్కారం



గుమ్మళ్ల సృజనకు శుభాకాంక్షలు చెబుతున్న మల్లికార్జుననాయుడు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పూడి గ్రామంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి గుమ్మళ్ల బలరామయ్య, ఆయన కుమార్తె ఐఏఎస్ అధికారి సృజనను ఎంజీఎం గ్రూప్ అధినేత గుడ్లూరు మల్లికార్జుననాయుడు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా పల్లె సంప్రదాయాలను మరవకుండా నేటి తరానికి అందించడం చాలా గొప్ప విషయమన్నారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం



గ్రామోత్సవంలో గోదాదేవితో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై గోదాదేవితో కల్యాణ వెంకన్న పురవీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. డిసెంబర్ 16వ తేదీ నుంచి ఆలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు. చివరి రోజైన సోమవారం వేకువజామున తిరుప్పావై ప్రవచనాలతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య, ధనుర్మాస పూజలను చేపట్టి భక్తులను దర్శనానికి అనుమతించారు. అనంతరం గోదాదేవి, కల్యాణ వెంకన్నలకు ప్రత్యేక తిరుమంజనం, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చిపై అధిరోహించిన ఉత్సవర్లు పురవీధుల్లో విహరించారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి



రాకేష్ కిరణ్‌ను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తూ, కార్యకర్తలకు అండగా ఉంటామని ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ క్రియాశీలక కార్యదర్శి రాకేష్ కిరణ్ తెలిపారు. సోమవారం సాయంత్రం పలువురు పార్టీ శ్రేణులు అయనను కలిసి శాలువ కప్పి, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాకేష్ కిరణ్ మాట్లాడుతూ అధిష్టానం తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతకు న్యాయం చేస్తానన్నారు. జిల్లా కమిటీలో తనకు స్థానం కల్పించిన జగన్నకు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డికి, ఎంపీలు మిథున్ రెడ్డి, గురుమూర్తి, సత్యవేడు ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న మిత్రబృందం

శ్రీకాళహస్తి: పట్టణంలోని తేరువీధిలో బస్‌షెల్టర్ వద్ద సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1994వ సంవత్సరం పదో తరగతి మిత్రబృందం భక్తులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ భక్తులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. సుమారు 300మంది భక్తులకు అన్నదానం చేశారు.

శివయ్యకు వేడి నీటితో అభిషేకం

– ఆగమోక్తంగా నటరాజస్వామికి పూజలు



వేడినీరు కాస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర రోజు సోమవారం వేకువ జామున మూల విరాట్‌కు వేడినీటితో అభిషేకం చేశారు. శ్రీకాళహస్తి గర్భాలయంలో పిండి విగ్రహం తయారు చేసి మూలవిరాట్ దగ్గర ఉంచి మొదటి అభిషేకించారు. సంవత్సరానికి ఒకసారి శివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర రోజు మాత్రమే ఇలా వేడి నీటితో మూలవిరాట్‌ను అభిషేకిస్తారు. అలాగే నటరాజస్వామి, శివకామి సుందరి ఆలయంలో ముందుగా కలశ ప్రతిష్ఠ చేసి గణపతిపూజ చేశారు. అనంతరం నటరాజ స్వామి, శివకామి సుందరి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, విభూదితో అభిషేకాలు చేపట్టారు. పురవీధుల్లో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నటరాజస్వామికి పూజలు చేస్తున్న వేదపండితులు

పండుగ పూట వైద్యం కరువు

వరదయ్యపాళెం: భోగి పండుగ వేళ పేదలకు ప్రభుత్వ వైద్యం కరువైంది. మండలంలోని చిన్న పాండూరు పీహెచ్‌సీలో భోగి పండుగ నాడు వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడడంతో జనం ఇబ్బంది పడ్డారు. ఇద్దరు స్టాఫ్ నర్సులకు ఏకంగా 2 రోజుల పాటు ఆస్పత్రి వైద్యాధికారులు సెలవు మంజూరు చేశారు. వారి స్థానంలో ఆశావర్కర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు చెందిన ఎంఎల్‌హెచ్‌పీలకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. వారు నామమాత్రంగా విధులకు హాజరు కావడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. సత్యవేడు మండలం పెద్దఈటిపాకంకు చెందిన వారు వైద్యం కోసం ఈ పీహెచ్‌సీకి రాగా ఆస్పత్రి అక్కడ ఎవరూ లేకపోవడంతో వారు ఆగ్రహానికి గురయ్యారు. 24 గంటలు అందుబాటులో ఉండాల్సిన పీహెచ్‌సీ సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టాఫ్ నర్సులు ఇద్దరికీ ఒకేసారి సెలవు మంజూరు చేయడంతో పాటు ఉన్న ఇద్దరు వైద్యుల్లో ఒకరు కూడా సోమవారం విధులకు హాజరు కాకపోవడం గమనార్హం.



ఓపీ కౌంటర్‌లో కనిపించని వైద్యసిబ్బంది

పెద్ద పండుగ.. అంతంతమాత్రమే..

- పల్లెల్లో కనిపించని భోగి సంబరాలు
- రంగవల్లులతో నరిపెట్టిన మహిళలు

సత్యవేడు: నియోజవర్గవ్యాప్తంగా పల్లెల్లో ఈ ఏడాది భోగి, సంక్రాంతి సంబరాలు పెద్దగా కనిపించలేదు. మూడు రోజుల పెద్ద పండుగను ఏటా ఆనందంగా జరుపుకునే ప్రజలు ఈసారి ప్రభుత్వ పథకాలు ఏవీ అందకపోవడం.. ఆపై వర్షాలకు పంటలు దెబ్బతినడంతో పండుగ సందడి పెద్దగా కనిపించలేదు. సోమవారం వీధుల కూడళ్ల, ఇళ్ల ముందు తెల్లవారుజామున యువకులు కలప, దుంగలను పోగు చేసి భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు వేశారు. పలుచోట్ల బంధువుల రాకతో సందడి నెలకొంది. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకోవాలనే కోరిక ఉన్నా.. సంక్షేమ పథకాల డబ్బులు ఏవీ అందక ఇబ్బంది పడుతున్నారు. యువకులు మాత్రం క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సంతోషంగా గడిపారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. గంగి రెద్దుల వారు ఇంటింటా తిరిగి బసవన్న దీవెనెలు అందజేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా ప్రజలు సోమవారం భోగి పండుగ జరుపుకున్నారు. వేకువజామునే భోగి మంటలు వేశారు. ఇళ్ల ముందు మహిళలు వేసిన రంగువల్లికలు ఆకట్టుకున్నాయి. పట్టణాల్లో ఉంటున్న వారు సొంతూళ్లకు రావడంతో సందడిగా కనిపించింది.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: భోగి పండుగ సందర్భంగా వేకువజామున ఇళ్ల ముంగిట భోగి మంటలు వేశారు. మహిళలు అందమైన రంగవల్లులు వేశారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా కేవీబీపురం మండల సీపీఐ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఆధ్వర్యంలో కొత్తూరు, కేవీబీపురం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో స్థానికులతో కలిసి విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

సంబరం లేని భోగి..



భోగి మంటలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో భోగి సంబరం అంతగా కనిపించలేదు. సోమవారం ఉదయం వర్షం పడడంతో భోగి మంటలు వేసేందుకు కాస్త ఇబ్బంది పడ్డారు. మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భార్య శ్రీవాణి రెడ్డి కుమార్తె పవిత్రా రెడ్డి దంపతులు భోగిమంటలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణ ప్రజలకు భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గతంలో జగనన్న నవరత్నాల పథకాలతో ప్రజలు ఎంతో సుభిక్షంగా పండుగ చేసుకునే వారని, కానీ కూటమి ప్రభుత్వంలో ఆరు గ్యారెంటీలు ఇస్తామని చెప్పి ఏడు నెలలు గడుస్తున్నా అతీగతీ లేదన్నారు.



ఆకట్టుకుంటున్న భువనేశ్వరి ముగ్గు





బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెంలో భోగి మంటలు



ఇంటి ముంగిట ముగ్గు వేస్తున్న మహిళలు

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం



రాచర్లలో నేలకొరిగిన వరి పంట

వరదయ్యపాళెం: అకాల వర్షం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. మండలంలో ముందస్తు నాట్లు వేసిన వరి పంట కోత దశకు వచ్చింది. అయితే సోమవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పూర్తిగా దెబ్బతింది. ప్రధానంగా పంట నేలకొరగడంతో పాటు వర్షం ధాటికి గింజలు రాలిపోయి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందారు. రాచర్ల, పెద్ద పాండూరు, తొండంబట్టు, సీఎల్ఎన్‌పల్లి, ముస్లింపాళెం, చిలమత్తూరు, కోవూరుపాడు, చిన్న పాండూరు ప్రాంతాల్లో పడిన వర్షానికి ఎక్కువగా పంట దెబ్బతింది.